## క్లుప్తంగా

### నేడు రౌండ్ టేబుల్ సమావేశం

వినుకొండ: వరికపూడిశెల ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు మొదలు పెట్టాలని కోరుతూ స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ తెలిపారు. స్థానిక సురేష్ మహల్ సెంటర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో తాగునీరు సాగునీరు లేక వలసలుపోతున్న ప్రాంతం, పశువులకు నీళ్లు దొరకని ప్రాంతం బొల్లాపల్లి మండలం, ఎగువ పల్నాడు ప్రాంతం, ప్రకాశం జిల్లా పుల్లలచెరువు ప్రాంతాలకు ప్రధానంగా ఉపయోగకరంగా ఉండే వరికపూడిశెల ప్రాజెక్టును సాధించుకోవాలని తెలిపారు. ఈ నెల 24 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో వరికపూడిశెల ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నల్లపాటి రామారావు, శ్రీనివాస రావు, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

### చెవిటి,మూగ పింఛనుదారుల రీవెరిఫికేషన్

నూజెండ్ల: మూగ చెవిటి దివ్యాంగులకు పింఛన్ల రీవెరిఫికేషన్ మార్చి 4,5 తేదీల్లో జరుగుతుందని ఎంపీడీవో పి.ఉమాదేవి శుక్రవారం తెలిపారు.మండలంలో 105 మంది మూగ చెవిటి పింఛనుదారులు ఉన్నారని, వీరందరూ నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాల్లో నిర్వహించే ప్రత్యేక శిబిరానికి హాజరు కావాలన్నారు. వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరికీ పంచాయతీ కార్యదర్శుల ద్వారా సమాచారం పంపినట్లు తెలిపారు.

### నేడు హజరత్ సుభాని దర్గా ఉరుసు మహోత్సవం



నాదెండ్ల: అప్పాపురం గ్రామంలో కొలువై యున్న హజరత్ మహబూబ్ సుభాని బాబా దర్గా 18వ ఉరుసు మహోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఉదయం దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరపనున్నారు. దర్గా వద్ద భక్తుల సౌకర్యార్థం ట్రస్ట్ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆదివారం గంధమహోత్సవం, సాయంత్రం సుమారు 20 వేల మందికి భారీ అన్నదానం చేయనున్నారు. దర్గాను విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

### 5వ తరగతి బాలికల గురుకులం ప్రవేశాలకు ఆహ్వానం

నూజెండ్ల: డాక్టరు బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకులం ఉప్పలపాడు పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించుతున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్‌వి.రమణమ్మ శుక్రవారం తెలిపారు. మొత్తం 80 సీట్లుకు గాను ఎస్సీ-60, బీసీ,సి-10, ఎస్టీ-05,బీసీ-04, ఓసీ-01 రిజర్వేషన్ ప్రకారం సీట్లు భర్తీ చేస్తామన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 6లోగా తుది గడవు అన్నారు. ఏప్రిల్ 6న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు స్థానిక పాఠశాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలు కోసం 9966783205 సెల్ నంబరు సంప్రదించాలన్నారు.

### రేపు షుగర్ వ్యాధుగ్రస్తులకు ఉచిత వైద్యశిబిరం

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడు పీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బాసట స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో షుగర్, బీపీలకు సంబంధించి ప్రత్యేక వైద్య సేవలను సీనియర్ డాక్టర్ లింగమల్ల మోహన్ భాస్కర్, ఇతర వైద్యులు పాల్గొని వైద్యసేవలు చేస్తారన్నారు. పరీక్షల అనంతరం రెండు నెలలకు సరిపడ మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం



నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూకే కోలేజియేట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని బంగారు పతకం సాధించినట్లు కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జీపీ రాజు తెలిపారు. చీరాల సెంట్‌ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 17వ తేదీన నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీలలో కళాశాల ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం చివరి సంవత్సరం విద్యార్థిని జి.నాగ సాయి గీతిక పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. 81 కేజీల వెయిట్ కేటగిరిలో బంగారు పతకం సాధించినట్లు వివరించారు. పతకం సాధించిన గీతికను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్. శ్రీనివాసరావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జీపీ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

# ఆర్‌యూబీ లేక అగచాట్లు

- పెరిగిన రైళ్ల రద్దీ
- రైలు గేటు పడితే వాహనదారులు ఇక్కట్లు
- శావల్యాపురం 268 రైలు గేటు వద్ద ట్రాఫిక్ సమస్యలు



శావల్యాపురం రైలుగేటు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం రైల్వే గేటు వద్ద (268) అండర్ లెవల్ రైల్వే వంతెన (ఆర్‌యూబీ) ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇక్కడి రైల్వే స్టేషను జంక్షన్ కావటం చేత నిత్యం రైళ్ల రాకపోకలు సంఖ్య పెరిగింది. దీంతో రైల్వేగేటు తరుచుగా వేయటం చేత శావల్యాపురం నుంచి బొందిలిపాలెం, శానంపూడి, మతుకుమల్లి, కారుమంచి, గుంటుపాలెం, వయ్యకల్లు, భాస్కర్‌నగర్, చినకంచర్ల, పిచికలపాలెం తదితర గ్రామాలకు చెందిన వారందరు వందల సంఖ్యలో బైకులు, ఆటోలపై వెళుతున్న వారందరు రైల్వేగేటు దాటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### ప్రతిరోజూ 40 నుంచి 60 రైళ్ల రాకపోకలు

రెండు రైలు ట్రాకులు వలన రైళ్ల నిత్యం 40 నుంచి 60 వరకు రాకపోకలు జరుగుతున్నాయి. ఇందులో అధికంగా గూడ్స్ రైళ్లు ఉన్నాయి. ఒక్కసారి గేటు వేస్తే నిమిషాలు వ్యవధి ఆగిపోవాల్సి ఉంటుంది. వ్యవసాయ పనుల సమయంలో వాహనదారులు అగచాట్లు దేవుడేకే ఎరుక.

గతంలో గుంటూరు జిల్లా డీఆర్‌యం మంగళగిరి రామకృష్ణ శావల్యాపురం రైల్వేస్టేషను సందర్శించిన సమయంలో ఆర్‌యూబీ ఆవశ్యకత గురించి మండలంలోని పలు గ్రామాల ప్రజలు లిఖిత పూర్వకంగా తెలిపారు. జిల్లా కలెక్టరు నుంచి పరిపాలన అనుమతులు అందాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని డీఆర్ఎం తెలిపారు. సంవత్సరాలు గడుస్తున్నా నేటి వరకు పురోగతి లేకపోవటం చేత రైల్వే అధికారుల పనితీరుపై ప్రజలు నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐదు నిమిషాలు రైలుగేటు పడితే వాహనాలు సంఖ్య పెరగటంతో పాటు గేటు తీయగానే ఉరుకులు పరుగులు పెడుతున్నారు. 108 అత్యవసర వాహనం వచ్చిన సమయంలో బాధితులు తీవ్ర అసౌకర్యానికి గురైతున్నారు. కొన్ని సమయాల్లో ప్రాణపాయ పరిస్థితి నెలకొంటుంది. వివిధ గ్రామాల నుంచి సైకిళ్లపై వస్తున్న విద్యార్థులు సైతం సకాలంలో పాఠశాలకు వెళ్ళలేకపోతున్నారు.

### త్వరగా ఏర్పాటు చేయాలి



మాది శావల్యాపురం గ్రామం రైల్వే గేటు అవతల ఎస్టీ కాలనీలో మేము నివాసం ఉంటున్నాం. నిత్యం ఇదే మార్గంలో రాకపోకలు చేస్తా. ప్రస్తుతం శావల్యా పురం రైల్వే స్టేషను జంక్షన్ కావటం చేత రైళ్ల రాకపోకలు పెరగటంతో రైలు గేటు వేయటంతో రద్దీ పెరిగింది. రైల్వే అధికారులు స్పందించి ఆర్‌యూబీ ఏర్పాటు చేయాలి

–యాగసిరి చెన్నమ్మ, సర్పంచ్, శావల్యాపురం

### సమస్య పరిష్కరించాలి



మాది మతుకుమల్లి గ్రామం నేను ప్రతిరోజు వివిధ పనులపై శావల్యాపురం వస్తా. శావల్యాపురం రైల్వేస్టేషను జంక్షన్ కావటం చేత రైళ్ల రాకపోకలతో రైలుగేటు పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల నరసరావుపేట పార్లమెంటు సభ్యుల దృష్టికి లిఖిత పూర్వకంగా వివరించాం. క్రాసింగ్ వలన గంటల వ్యవధి ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్నాం.

– ముంద్రు హనుమంతరావు, మతుకుమల్లి మాజీ సర్పంచ్

# ఘనంగా మాతృభాషా దినోత్సవం



డాక్టర్ పీవీ సుబ్బారావు, దార్ల బుజ్జిబాబులను సన్మానిస్తున్న గార్డ్స్ సంస్థ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: మాతృభాష పట్ల ప్రతి ఒక్కరూ మక్కువ కలిగి ఉండాలని కేర్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ గండికోట అనంత కోటేశ్వర రావు తెలిపారు. పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అనంత టేశ్వరరావు మాట్లాడుతూ, పిల్లలకు తొలి గురువు మాతృమూర్తి అని తెలిపారు. మాతృభాషలో సులువుగా విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించవచ్చన్నారు. విద్యార్థులకు మాతృభాష పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు. తెలుగు ఉపాధ్యాయిని సుధారాణి, స్వరూప తెలుగు గేయాలను ఆలపించి తెలుగు మాధుర్యాన్ని అందించారు. పాఠశాల డైరెక్టర్ కేసరి కోటిరెడ్డి, కరస్పాండెంట్ కె.సుందరి ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు.

**చిలకలూరిపేటలో...**

చిలకలూరిపేట: మాతృభాషాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ దాసరి చిట్టిబాబు చెప్పారు. గార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాష మృతభాష కారాదని వెల్లడించారు. దేశ భాషలందు తెలుగు లెస్స అనే విధంగా తెలుగు భాషాభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ సందర్భంగా తెలుగు రిటైర్డ్ ప్రొఫెసర్, సాహితీవేత్త డాక్టర్ పీవీ సుబ్బారావు, బాలల రచయిత డాక్టర్ దార్ల బుజ్జిబాబులను సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గేరా యాకోబు, గుంజి వీరాంజనేయులు, వడ్లాన చంద్రం, జెర్రిపోతుల బుల్లిబాబు, షేక్ బాజి పాల్గొన్నారు.

**రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో...**

రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ పీవీ సుబ్బారావు పాల్గొని మాతృభాష విశిష్టత, తెలుగు భాష ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఆళ్ల వేమనరెడ్డి, డాక్టర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.



మాతృభాషా దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

# పట్టణంలో వైఎస్సార్ సీపీ బలోపేతం కావాలి

**నూతన మున్సిపల్ విభాగ జిల్లా అధ్యక్షుడికి సూచించిన మాజీ ఎమ్మెల్యే**



డాక్టర్ గోపిరెడ్డిని సన్మానిస్తున్న రెహమాన్

నరసరావుపేట: పట్టణ ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నాయకులకు సూచించారు. పార్టీ తరఫున మున్సిపల్ విభాగ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పట్టణ మాజీ కౌన్సిలర్ షేక్ రెహమాన్ శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేను కలిసి తన నియామకానికి సహకరించినందుకు శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ విద్యావంతుడు, 30వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ రెహమాన్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి నియమించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పార్టీ ఏర్పడిన నాటి నుంచి రెహమాన్ పార్టీ బలోపేతం కోసం ఎంతో కష్టపడ్డారని, కౌన్సిలర్‌గా మున్సిపాలిటీలో అధికారులందరిని సమన్వయం చేసుకొని వార్డు అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారని, యువతను కలుపుకొని పోయి పట్టణంలో పార్టీని బలోపేతం చేయడంలో ముఖ్య పాత్ర పోషించారన్నారు.

అదేవిధంగా ప్రస్తుతం ఇచ్చిన పదవి ఎంతో బాధ్యతాయుతమైందని, జిల్లాలోని అన్ని మున్సిపాల్టీలలో పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్లని ప్రస్తుత కౌన్సిలర్లని సమన్వయం చేసుకొని రానున్న రోజుల్లో పట్టణాల్లో పార్టీని బలోపేతం చేయాలని కోరుతూ శాలువా కప్పి అభినందించారు. రెహమాన్ మాట్లాడుతూ తనను నియమించిన పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, డాక్టర్ గోపిరెడ్డిలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తనను నమ్మి ఎంతో పెద్ద బాధ్యతను పార్టీ అధిష్టానం అప్పగించినందుకు తాను కూడా ఎంతో బాధ్యతగా పనిచేసి జిల్లాలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో అన్నీ వర్గాలను కలుపుకొని పార్టీని బలోపేతం చేసి తిరిగి ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్, ఎమ్మెల్యేగా డాక్టర్ గోపిరెడ్డిలను గెలిపించుకునేందుకు తన శాయశక్తుల శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షులు గుజ్జర్లపూడి ఆకాష్, గిరిజన కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వర్లు, నాయకులు గంటెనపాటి గాబ్రియేలు, ఎస్‌కె ఆంజనేయులు, షేక్ కరిముల్లా, సయ్యద్ ఖాదర్‌బాష, పార్టీ మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జీలు, కార్యకర్తలు పాల్గొని రెహమాన్‌కు అభినందనలు తెలియజేశారు.

### ఈ మంచినీళ్లు తాగలేకున్నాం!

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో రక్షిత మంచినీటి సరఫరా పథకం నుంచి విడుదల అవుతున్నా తాగునీరు రంగుమారి దుర్వాసన వెదజల్లుతూ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ సర్పంచి ముంద్రు హనుమంతరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్షిత మంచినీటి పథకం అలంకార ప్రాయంగా మారిందని తాగునీరు సరఫరా వినియోగించే ఫిల్టర్ బెడ్స్ రెండు ఉండగా ఒకటి మాత్రమే పనిచేస్తుందన్నారు. జలజీవన్ మిషన్ ప్రతి ఇంటికి నీటి కుళాయి ఇవ్వాల్సి ఉండగా లోపాలు వలన కొన్ని వీధుల్లో, నివాస గృహాలకు పూర్తిస్థాయిలో ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగర్ కెనాల్ నీటి సరఫరా కూత వేటు దూరంలో గ్రావిటి మెయిన్ ద్వారా సరఫరా అయ్యే అవకాశాలు ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వల్ల పిట్టంబండ కాల్వ వద్ద వాటర్‌వాల్ అమర్చి పంట కాల్వ సమయం అంతా నీటిని ఎటువంటి ఖర్చు లేకుండా ఫిల్టర్‌బెడ్స్‌కు సరఫరా అయ్యే ఉన్నా అధికారుల వైఫల్యంతో ఉపయోగించటానికి పనికిరాని నీటిని విడుదల చేస్తున్నారన్నారు. వేసవి కాలం ప్రారంభం అవుతుందని ఇప్పటికైనా తాగునీటి సరఫరా, గ్రామ పంచాయతీ అధికారులు యుద్ధప్రతిపాదికన చెరువులో ఉన్న నీటిని బయటకు పంపి, చెరువును మరమ్మతులు చేపట్టి సాగర్ నీటితో నింపి గ్రామస్తులు రక్షిత మంచినీరు సరఫరా చేయించాలన్నారు.

### ప్రణాళికతో అభివృద్ధి సాధించాలి




మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో, పక్కన ఇతరులు

బొల్లాపల్లి: ఐటీసీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ సిబ్బందికి గ్రామపంచాయతీల అభివృద్ధిపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి ఎంపీడీవో పి. సీతారామయ్య హాజరై మాట్లాడుతూ ప్రతిఏటా గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేసుకొని పంచాయతీల్లోని వనరులను సద్వినియోగపరచుకొని అభివృద్ధి సాధించాలన్నారు. గ్రామపంచాయతీ నిధులతో ప్రణాళిక రూపొందించుకొని పంచాయతీలు అభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీసీ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వసతి గృహంలో అమలైన ముఖ హాజరు



వసతి గృహంలో ముఖ హాజరు తీసుకుంటున్న సిబ్బంది

నూజెండ్ల: నూజెండ్ల బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ముఖహాజరు (ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం ఎఫ్‌ఆర్‌ఎస్) విధానాన్ని ప్రభుత్వం అమలు చేసినట్లు వార్డెన్ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ విధానంలో ఉదయం అల్పాహారం సమయానికి ముందు సాయంత్రం స్కూలు సమయం తర్వాత ప్రతిరోజు విద్యార్థుల హాజరును నమోదు చేయాల్సి ఉందన్నారు. హాస్టల్లో మొత్తం 91 మంది విద్యార్థులు వసతి సౌకర్యం పొందుతున్నారన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం ద్వారా కచ్చితమైన విద్యార్థుల సంఖ్య ప్రభుత్వానికి చేరుతుందన్నారు.

**బోగస్ విద్యార్థుల హాజరుకు చెక్..**

గతంలో ప్రభుత్వ వసతి గృహల్లో విద్యార్థుల సంఖ్య వారి హాజరుకు వ్యత్యాసం భారీగా ఉండేది. ఇటువంటి ఆక్రమణాలను అడ్డుకునేందుకు ముఖ హాజరు ఎఫ్‌ఆర్‌ఎస్‌ను ఫిబ్రవరి 1 నుంచి నూతన విధానం అమల్లోకి వచ్చిందని వార్డెన్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. అయితే అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బోగస్, ఆక్రమాణాలకు అడ్డుకట్ట వేసినప్పటికీ సర్వర్ సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు.

# ఆక్షేపణ లేని నివాస గృహాలకు అనుమతులు



మాట్లాడుతున్న తహసీల్దారు సురేష్

శావల్యాపురం: ఆక్షేపణ లేని భూముల్లో ఎవరైనా నివాస గృహాలు ఉన్న వారందరికీ ప్రభుత్వం నూతనంగా జీవో నంబరు 30 యాక్టు ద్వారా అర్హులందరికీ ప్రభుత్వం అనుమతులు మంజూరు చేస్తామని తహసీల్దారు సభావత్ సురేష్ నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొత్తలూరు గ్రామపంచాయతీ శివారు గ్రామమైన తుమ్మలకుంటలో లబ్ధిదారులను గుర్తించే పనులు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ కొండ గుట్ట స్థలాలు, రాళ్ళగుట్టల స్థలాల్లో నివాస గృహాలు ఏర్పాటు చేసుకునే ఉంటే అలాంటి వారికి సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తామన్నారు. అలాగే దీర్ఘకాలికంగా గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదులకు కూడా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తామన్నారు. అనంతరం కొత్తలూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఆయనతో పాటు సర్వే డిప్యూటీ అధికారి పేరు సోముల నాసరయ్య, సర్వేయర్ రాజు, విఆర్వోలు ఉప్పులూరి చినమంగయ్య, రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

# నేడు పదో తరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్

యడ్లపాడు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన విద్యార్థుల్ని ప్రోత్సహించే ఉద్దేశంలో భాగంగా యడ్లపాడుకు చెందిన బాసట సామాజిక, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యాన శనివారం పదో తరగతి విద్యార్థులకు ఉపకార వేతనాల అర్హత పోటీల్ని నిర్వహించనుంది. ఉదయం 10:30 గంటలకు ఎడ్లపాడు లూథరన్ హైస్కూల్లో ఆవరణలో జరిగే ఈ రాత పరీక్షలకు మండలంలోని కేవలం ప్రభుత్వ విద్యాసంస్థలైన 9 జెడ్పీహైస్కూల్స్, ఒక లూథరన్ హైస్కూల్‌లో పదో తరగతి చదివే 347 మంది విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**పరీక్ష నిర్వహణ వివరాలు..**

ముఖ్య అతిథులుగా ఎంఈవో ఎంపీ నాగరత్నం, ఎస్ఐ వి.బాలకృష్ణ పాల్గొని ప్రారంభిస్తారు. పరీక్ష 60 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఒకగంట మాత్రమే ఉంటుంది. గణితం-20, సైన్స్-20, సోషల్-10, ఇంగ్లిష్-10 మార్కుల ప్రశ్నలకు సమాధానం రాయాల్సి ఉంటుంది. పరీక్షల్లో ఫస్ట్‌ర్యాంక్ రూ.50 వేలు, సెకండ్‌ర్యాంక్ రూ.30 వేలు, తృతీయర్యాంక్ రూ.20 వేలు, నాలుగోర్యాంక్ రూ.11 వేలు, ఐదోర్యాంక్ రూ.9 వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అనంతరం వారికి మానసిక నిపుణులతో పబ్లిక్ పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మోటివేషన్ క్లాసులు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో బాసట సంస్థ అధ్యక్షుడు నూతలపాటి కాళిదాసు, కార్యదర్శి సామినేని వెంకటేశ్వర్లు, కోశాధికారి కేతరామబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# సుబాబుల్ వ్యాపారిపై టీడీపీ నేతల దౌర్జన్యం

**కర్ర అమ్మకుండా అడ్డుకుంటున్న వైనం**



ఎండుగుంపాలెంలో నిల్వ ఉంచిన కర్ర

నాదెండ్ల: ఎండుగుంపాలెం గ్రామంలో సుబాబుల్ వ్యాపారం చేసుకునే వ్యక్తిపై టీడీపీ నాయకులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. గ్రామానికి చెందిన మొక్కపాటి శ్రీనివాసరావు వ్యవసాయంతో పాటూ వేసవిలో సుబాబుల్ తోటలు కొనుగోలు చేసి మార్కెటింగ్ చేస్తుంటాడు. నెలక్రితం కొన్ని తోటలు కొట్టి సుమారు వంద టన్నులకు పైగా కర్రను గ్రామం వెలుపల పొలాల్లో, రోడ్డు పక్కన నిల్వ ఉంచాడు. అయితే కర్రను లోడింగ్ చేసేందుకు ఒప్పుకునేది లేదంటూ టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారు. నువ్వు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడివని, నిన్ను వ్యాపారం చేసుకోనివ్వమంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. అంతేకాక లారీ యజమానులు, హమామీలకు ఫోన్ చేసి ఎండుగుంపాలెం గ్రామానికి రావొద్దంటూ హెచ్చరించారు. దీంతో శ్రీనివాసరావు గ్రామంలోని పలువురు టీడీపీ నాయకులను సంప్రదించి బ్రతిమాలుకున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

# పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతగా పనిచేయాలి

**మస్టర్‌ను పరిశీలించి సూచించిన మున్సిపల్ కమిషనర్**



పట్టణంలో తెల్లవారుజామునే మస్టర్ పరిశీలిస్తున్న కమిషనర్

నరసరావుపేట: పట్టణంలో పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతగా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు కోరారు. శుక్రవారం తెల్లవారు జామున పట్టణంలోని మూడు, నాలుగు డివిజన్లకు చెందిన కార్మికుల హాజరు ప్రక్రియ (మస్టర్) పరిశీలించారు. వర్కర్లు అందరూ తమకు కేటాయించిన సమయం ఉదయం 5.30 నుంచి10.30 వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదుగంటల వరకు బాధ్యతగా పనిచేయాలన్నారు. వార్డు పర్యవేక్షణ కార్యదర్శులు తమ పరిధిలోని చెత్త పడేసే పాయింట్లలో చెత్తను పూర్తిగా తొలగించి ఆ ఫొటోలను గ్రూపులో పంపించాలని ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వచ్చే కోటప్పకొండ తిరునాళ్లను పురస్కరించుకొని వర్కర్లు, మేస్త్రీలు, పర్యావరణ కార్యదర్శులచే సక్రమంగా పనిచేయించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. పార్కులు, ఫౌంటేన్లు తీర్చిదిద్దాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులకు సూచించారు.

### బైకు అదుపుతప్పి ఒకరికి గాయాలు

నూజెండ్ల: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని ముప్పరాజువారిపాలెం గ్రామంలో శుక్రవారం జరిగింది. వివరాల మేరకు నూజెండ్ల గ్రామానికి చెందిన ఏసోబు స్వగ్రామం నుంచి ఉల్లగల్లు గ్రామానికి తన బైకుపై వెళుతుండగా ముప్పరాజువారిపాలెం కాల్వ కట్ట సమీపంలో ఆదుపు తప్పి ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. స్థానికులు 108 అత్యవసర వాహనానికి సమాచారం ఇవ్వటంతో క్షతగాత్రుడిని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

### ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలన



కేంద్రాలను పరిశీలిస్తున్న ఏఈఆర్వో ఏవీ రమణ

నాదెండ్ల: కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఈ నెల 27న జరగనున్నందున మండల కేంద్రమైన నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్‌కేంద్రాలను శుక్రవారం ఏఈఆర్వో, తహసీల్దార్ ఏవీ రమణ పరిశీలించారు. రెండు కేంద్రాల్లో 1614 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. గతంలో సాధారణ ఎన్నికల సందర్భంగా గోడలపై వేసిన నెంబర్లు, వివరాలను తొలగించి ఎమ్మెల్సీ ఎన్నికల వివరాలు వేశారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ ఎన్నిక జరగనుందని, నూరు శాతం పోలింగ్ జరిగేలా ఓటర్లు ముందుకు రావాలని కోరారు. గుంటూరు డీఆర్వో ఖాజావలి ఆర్వోగా వ్యవహరించనున్నారు.

### రొంపిచర్ల, వి.రెడ్డిపాలెంలలో ఆర్డీవో పర్యటన



రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల రెడ్డిపాలెం, రొంపిచర్ల గ్రామాల్లో ఆర్డీవో మధులత శుక్రవారం పర్యటించారు. విప్పర్ల రెడ్డిపాలెం గ్రామంలో అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో గృహాలు నిర్మించుకున్నవారి వివరాలు సేకరించారు. అలాగే గృహాలను పరిశీలించారు. అనంతరం రొంపిచర్ల గ్రామంలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన నివేశన స్థలాలను పరిశీలించారు. రెవెన్యూ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట తహసీల్దార్ బండి నిర్మల, ఆర్ఐ, వీఆర్వోలు పాల్గొన్నారు.